# బోరింగ్

—కాడి

ఎర్ర జీపు "శెల్లి" దుమ్మును లేపుతూ ఊరి మధ్యలో వచ్చి ఆగింది. ఆ జీపులో ఇరవై నాలుగు ఇరవైఅయిదు సంవత్సరాల వయస్సు యువకులు నలుగురు, దాదాపు 35 సంవత్సరాల వయస్సు మరో వ్యక్తి ఉన్నారు. అందరూ ఎర్ర చొక్కాలు తొడుక్కున్నారు. జీపుపైన కూడా ఎర్రజెండాలు ఎగురుతున్నవి. అందరి కంటె వయస్సు ఎక్కువ ఉన్న వ్యక్తి వారికి నాయకుడులా ఉన్నాడు. పోజు కూడా అలాగే ఉన్నది. జీపు ఎర్రరంగు, జెండాల ఎర్రరంగు వెలిసిపోయి ఉన్నది వారి విప్లవతత్వంలా.

జీపు ఆగగానే ఒక ఎర్రచొక్కా యువకుడు విసురుగా దిగాడు ముఖం చూస్తేనే అర్థం అవుతున్నది జీపు ఈ రెండు మూడు రోజుల నుండే ఎక్కి తిరుగు తున్నట్లు. ఏదో పుష్పక విమానం ఎక్కి తిరుగుతున్న ఫీలింగ్ ఆ ముఖంలో-ఒకసారి ఆ యువకుడు తన హిప్పీకటింగ్ జూలును అటూ ఇటూ విదిల్చి ఎవరైనా కన్పిస్తా రని చూశాడు అటూ ఇటూ-కాని నవంబర్ నెలలో బస్తర్ ఆదివాసులు ఇళ్ళలో ఎవరూ సరిగా ఉండరు. అందరు పొలాల దగ్గరి పాకల వద్దనే ఉంటారు. ముసలి వారు పిల్లలు మాత్రమే ఊరిలో వుంటారు. వీధులలో ఎవరు కనిపించక పోయేసరికి జీపు దిగిన యువకుడు జీపులోకి చూస్తూ "కామ్రేడ్‌సాబ్ ఊరిలో జనాలు ఎవరు ఉన్నట్లు లేరు ఎలాగ" అన్నాడు. మన ఓట్లు ఎలాగ అనే అర్థం ఆ మాటల్లో స్పష్టంగా అర్థం అవుతున్నది. ఆ భావం అర్థం చేసుకున్న కామ్రేడ్ సాబ్ "అయ్యో కామ్రేడ్ ఎందుకు తొందరపడతావు ఆ రెండిళ్ళ అవతల పిల్లల మాటలు విన్పిస్తు న్నాయి వెళ్ళి చూడు" అంటూ జీపులో కూర్చునే హుకుం జారీ చేశాడు.

తనకెందుకు వినపడలేదు నిజమా అబద్ధమా అని మనసులోనే అనుకుంటూ ఆ ఎర్రచొక్కా యువకుడు కామ్రేడ్ సాబ్ చెప్పిన దిక్కు వెళ్ళి చూశాడు. నిజంగానే అక్కడ పిల్లలు ఆడుకుంటున్నారు. ప్రక్కనే ఒక ముసలి రైతు కూర్చున్నాడు వెదురు తడక అల్లుతూ. తాగుబోతుకు కల్లుపాక చూస్తే కలిగినంత ఆనందం కలిగింది ఎర్రచొక్కా యువకునికి. అంతే ఆలస్యం చేయకుండ "లాల్‌సలాం కామ్రేడ్" అంటూ ముసలి రైతుకు అభివాదం చేశాడు. ఒక ఓటు దొరికిందోచ్ అన్నట్లు ఉన్న ఆ లాల్‌సలాం శబ్దం విని "అమ్మయ్య దొరికారు జీపు కూడా అదే పోలీస్"

అంటూ డ్రైవర్‌కు ఆదేశం ఇచ్చాడు కామ్రేడ్ సాబ్. అప్పటివరకు కామ్రేడ్ సాబ్‌కు కూడా ఎవరూ జనాలు దొరకరేమో అని భయంభయంగా ఉండె.

కామ్రేడ్ సాబ్ కూడా జీపు దిగి ముసలిరైతు దగ్గరికి వచ్చేసరికి ఎర్రచొక్కా యువకుడు జనాలందరు ఎక్కడికి వెళ్ళిన విషయం తెలుసుకుంటున్నాడు. ఇంతలో కామ్రేడ్ సాబ్ కూడా అక్కడికి రావడంతో వివరాలు తెలుసుకోవడం ఆపి కామ్రేడ్ సాబ్‌కు రిపోర్టు ఇచ్చాడు. "ఊరి వాళ్ళందరు పొలాల వద్ద ఉన్నారట" అని.కామ్రేడ్ సాబ్ ఒక్క నిమిషం ఆలోచించి "సరే ఈ ముసలోన్ని రైతులందరిని మీటింగ్ కోసం రమ్మనమని పొలాల వద్దకు పంపు. అలాగే థానాగుడి (చావడి) ఎక్కడో తెలుసుకో అందరు వచ్చేవరకు అక్కడే కూర్చుందాము. మీటింగ్ కూడా అక్కడే చేద్దాం" అంటూ మొత్తం ప్రోగ్రాం అంత గుక్క తిప్పుకోకుండా చెప్పేశాడు.

ఆ ఎర్రచొక్కా యువకుడు కామ్రేడ్ సాబ్ ఆదేశాన్ని ఉన్నదున్నట్టు రైతుకు అప్పచెప్పేసి "థానాగుడి ఎక్కడా" అంటూ అడిగాడు. కాని ఊరిలో థానా గుడి కూలిపోయి మూడు సంవత్సరాలు అవుతున్నది. ఊరిలో సంఘంపుట్టి పట్వారులకు, గార్డులకు దేహశుద్ధి చేయడం ఆరంభం అయ్యాక థానాగుడిని శుభ్రం చేయడం అంతం అయ్యింది. అందుకే అది కూలి దానిచుట్టూ, వాకిట్లో పిచ్చి చెట్లు పిచ్చిగా పెరిగాయి. కూలకుండా కొద్దిగా మిగిలిన భాగాన్ని గొడ్లు, పందులు వాడుకుంటున్నవి. సంఘం పుట్టక ముందు థానాగుడులు మూడుపువ్వులు ముప్పయికాయలగా వర్ధిల్లు తుండేవి. ఆ రోజుల్లో థాణాగుడి పొయ్యి ఆరిన రోజు, కోడిపుంజు తెగనిరోజు, కల్లు సీసాల శబ్దం వినపడని రోజు అంటు ఉండపోయేవి. కాని ఈ రోజు థాణాగుడిలో పందుల గురగురలు గొడ్ల పేడ తప్ప ఏమిలేదు. అందుకే థాణాగుడి పేరు వినే సరికి ముసలి రైతు ఆశ్చర్యపోయాడు ఒకసారి ఆ యువకున్ని ఎగాదిగా చూసి "ఇల్లే బాబు మా ఊరిలో థాణాగుడి లేదు. ఊరి వాళ్ళు అందరు వచ్చెవరకు ఇక్కడే కూర్చోండి. మీటింగ్ ఇక్కడే చేయవచ్చు" అంటూ ఇంట్లో నుండి ఒక మంచం తెచ్చి కూర్చోవడానికి ఇచ్చి పొలాలవైపు బయలుదేరాడు ఊరి వాళ్ళందరిని పిలవడానికి. అంతకంటే మించి చేసేది ఏమీ లేక కామ్రేడ్లు అందరు వచ్చి మంచంలో కూలబడ్డారు.

ముసలిరైతు ముందుగా గ్రామ సంఘం అధ్యక్షుడు మూఖాల్ ఖేతుల్ (పాక) కాడికి బయలు దేరాడు. వెనకటికాలం అయితే ఇటువంటి కబుర్లు ముందుగా పటేల్కు

సర్పంచ్‌కు చేరేవి. కాని కాలం మారింది బలం సంఘానికి చేరింది. మూఖాల్ అప్పుడే అన్నం తిని కాసేపు ఒరుగుదామని కూర్చున్నాడు. గ్రామంవైపు నుండి ముసలి రైతు తన పాకవైపే వడివడిగా రావడం చూసి అనుమానంగా లేచి నిల్చున్నాడు. ఈ మధ్య పోలీసులు మూఖాల్ గురించి తిరుగుతున్నారు. అప్పటి నుండి జాగ్రత్తగా ఉంటున్నాడు. ఊరిలోకి పోలీసులు రాలేదు కదా కొంపదీసి అని అనుకుంటుండగానే ముసలిరైతు దగ్గరికి రానే వచ్చాడు. "బాత పేపి (ఏంటి పెద్దనాన) ఊరిలోకి పోలీసులు వచ్చిండ్లా ఏంది" అంటూ మూఖాలే ముందు ప్రశ్నించాడు ఆతృతగా. "లేదు కాని ఎవరో చూస్తే పైకాల్ (ఉద్యోగులు) లెక్క ఉన్నారు కాని లాల్ సలాం అంటున్నారు. వాళ్ళు వచ్చిన జీపు మీద కూడా మన ఎర్రజెండాలు ఉన్నవి. ఊరి వాళ్ళందరికి కబురు పెట్టు మీటింగ్ చేయాలి అంటున్నారు. మన అన్నల మనుషులేమో ?" అంటూ మూఖాల్ ప్రశ్నకు సమాధానంతో పాటు తన అనుమానపు అభిప్రాయాన్ని కూడా వ్యక్తపరిచాడు ముసలి రైతు. ఆ ఎర్రచొక్కా యువకుడు లాల్‌సలాం అన్నకాడి నుండి రైతు వాళ్ళు ఎవరైనది తేల్చుకోలేక సతమతమవుతున్నాడు.

కాని మూఖాల్‌కు అంతా అర్థం అయ్యింది అందుకే వెంటనే "వాళ్ళు అన్నగాళ్ళు కాదు బొన్నగాళ్ళు కాదు. వాళ్ళు ఓట్ల కోసం వచ్చిండ్లు. అసలు బాబాల్ (తండ్రి) భీమారై మూలకు పడి నేను పొలం పని మీద పడేసరికి మీటింగ్ ఆలస్యం అయ్యింది. మొన్ననే ఊరి వాళ్ళందరికి మీటింగ్ చేసి ఈ ముచ్చట చెప్పేది ఉండె." అన్నలు మొన్న ప్రక్క ఊరికి పిలిపించుకుని చెప్పిన విషయాలను గుర్తుచేసుకుంటు అన్నాడు మూఖాల్. మళ్ళీ ఒక్క నిమిషం ఆగి "సరే నువ్వు దేవాల్ వద్దకు వెళ్ళి ఈ విషయం చెప్పి ఆ పక్కపాకల వద్ద రైతులందరిని తీసుకుని అలా రండి. నేను ఈ పక్క వాళ్ళందరిని తీసుకుని వస్తాను" అంటూ గుంజకు ఉన్న చొక్కా తీసుకుని భుజం మీద వేసుకుని ఇవ్వాళ వీళ్ళను ఆట పట్టించాలి అని మనసులో అనుకుంటూ బయలుదేరాడు.

ముసలిరైతు దేవాల్ వద్దకు వెళ్ళి మూఖాల్ చెప్పిన విషయం అంతా చెప్పాడు. దేవాల్ సంఘం గ్రామ కార్యదర్శి. దేవాల్ కూడా చురుకైన యువకుడే, గ్రామంలో సంఘం పుట్టినకాడి నుండి సంఘంలో పని చేస్తూ వస్తున్నాడు. పెద్ద


561

మనుషులు ఎన్ని అడ్డంకులు కల్పించినా ఎన్నడూ సంఘాన్ని వదలలేదు. దొంగ కమ్యూనిస్టుల మాట వినేసరికి దేవాల్‌కు కూడా ఒళ్ళు మండింది. ఎందుకంటె వీళ్ళు ఓట్లు అప్పుడు, తునికి ఆకు కాంట్రాక్టర్ల వద్ద చందాలు వసూలు చేసేటప్పుడు తప్ప ఎన్నడూ గ్రామాలకు రారు. ఎన్నడూ ఏ సమస్య పట్టించుకోరు. పైగా అన్నలం (దళం) మేము ఒకటేనంటూ ఓట్లు దండుకుంటు, షావుకార్ల వద్ద చందాలు వసూలు చేస్తూ బతుకుతున్నారు. దేవాల్ కూడా ఇవ్వాళ వీళ్ళ సంగతేందో తేల్చుకోవాలి అనుకుంటూ బయలుదేరాడు రైతులను జమచేయడానికి.

చూస్తూ చూస్తూ ఉండగానే "కామ్రేడ్లు" కూచున్న ముసలి రైతు ఇంటి చుట్టూతా ఉన్న ఇండ్ల వద్ద రైతులు జమకావడం మొదలైంది కాని రైతులెవరు కామ్రేడ్ల దగ్గరికి మాత్రం పోవడం లేదు. రైతులు జమకావడం చూచి కామ్రేడ్ సాబ్‌కు ఎంతో సంతోషమైంది. ఒక ఎర్రచొక్కా యువకుడు ఒక్క ఓటు రెండు ఓట్లు అంటూ ఓటు వయస్సు ఉన్న వారిని లెక్కపెడుతున్నాడు. మిగతా కామ్రేడ్లు కుంభకర్ణ నిద్రలో ఉన్నారు. చాలా మందే వస్తున్నారు కాని వేరే ఇండ్ల వద్ద జమ అవుతున్నారు. దగ్గరికి రావడం లేదు లాల్ సలాం అనడం లేదు ఏంటి అని ఆశ్చర్యపోయాడు కామ్రేడ్ సాబ్. ఇక తనే చొరవ చేయాలనుకున్నాడు "అందరికి లాల్ సలాం దాద" అంటూ బిగ్గరగా అరిచాడు కాని ఎటువంటి ప్రతిస్పందన కనిపించ లేదు. ఇంతలో మనస్సులో తళుక్కున ఒక ఆలోచన మెరిసింది. వెంటనే పడు కున్న వాళ్ళను లేపి "ఏయ్ కామ్రేడ్స్ అదేదో అన్నగాళ్ళ పాట కొంత కొంత వస్తది కదా ఆ పాట పాడండి పాట విని అయినా జనం దగ్గరికి వస్తారు" అన్నాడు.

లేచిన యువకులు నిద్ర మత్తులోనే జోగుకుంటూ ఆ వచ్చీరాని పాటను గార్దభరాగంలో ఎత్తుకున్నారు. పాట విని జనం రావడం ఏమోకాని కొద్ది దూరంగ ఉన్న పిల్లల గుంపు పగలబడి నవ్వేసరికి పాడేవాళ్ళ గొంతులకు సడెన్‌బ్రేక్ పడ్డది. ముఖాలన్ని సిగ్గుతో వాడిపోయినయి. ఇక లాభం లేదని కెమ్రేడ్ సాబ్ తనే లేచి "కామ్రేడ్స్ అందరు ఇక్కడికి రండి నేను మీటింగ్ చేస్తాను. మేము ఎవరమోకాదు మేము వాళ్ళు ఒకటే రండిరండి" అంటు అన్నలు మేము ఒకటే అనే అర్థంలో అన్నాడు. అయినా జనంలో ఉలుకు లేదు పలుకు లేదు. పాపం కామ్రేడ్ సాబ్‌కు తెల్వదు వారు ఎవరి గురించి ఎదురు చూస్తున్నారో. వాళ్ళంత సంఘం కమిటి, గ్రామరక్షణ దళం రాక గురించి ఎదురు చూస్తున్నారు. సంఘం కమిటి, గ్రామరక్షణ

562

దళం ఎవరెవరు ఏ పని చేయాలో పనివిభజన చేసుకుని వచ్చేసరికి కొద్దిగా ఆలస్యం అయ్యింది.

మూఖాల్ వస్తూనే కామ్రేడ్ సాబ్ కూర్చున్న దగ్గరికి వచ్చి అతను కూర్చున్న మంచంలో ఎక్కి నిలబడ్డాడు. ఒకసారి అటూ ఇటూ చూసి "కామ్రేడ్స్ అందరు దగ్గరికి రావాలి" అంటూ బిగ్గరగా పిలిచాడు. ఆ ఇంటి వద్ద ఈ ఇంటివద్ద కూర్చున్న రైతులు కమిటీ వాళ్ళు రావడం చూస్తూనే లేచి అంతకు ముందు కూర్చోవడానికి పరుచుకున్న తువ్వాలలు తీసి దులుపుకుని భుజాలపై వేసుకుని మూఖాల్‌వైపు బయలుదేరారు. మిగతా కమిటీవాళ్ళు గ్రామరక్షణ దళం వాళ్ళు మూఖాల్ పక్కకు వచ్చి నిలబడ్డారు "అల్లాట్ ఒంది పాట పాడకల్ మున్నే" (సరే ఒక పాట పాడుదాం ముందు) అని మూఖాల్ అనేసరికి ప్రక్కన నిల్చున్న కమిటి వాళ్ళు, ఇంతకు ముందు ఎర్రచొక్కాల వాళ్ళు గతుక్కుంటు పాడిన పాటనే ఎంతో శ్రావ్యంగా ఎత్తుకున్నారు. దూరంగ ఉన్న పిల్లల గుంపు ఉరికి వచ్చి పాడుతున్న వారి వెనక నిలబడి కోరస్ ఇవ్వడం మొదలుపెట్టారు. ఎర్ర చొక్కాల వాళ్ళకు అప్పుడు అర్థం అయ్యింది. ముందు పిల్లలు ఎందుకునవ్వారో —

కామ్రేడ్ సాబ్‌కు మాత్రం అంతా గందరగోళంగా ఉంది. ఈ మంచం ఎక్కినవాడు ఎవడోకాని చెయ్యికలపబోతే చెయ్యి కలపడంలేదు. లాల్‌సలాం అంటే కూడా చప్పుడు చేయడం లేదు. అసలు మేము ఇక్కడ ఉన్నాము అన్న విషయం ఎరగనట్లే ప్రవర్తిస్తున్నారు ఏమన్నా చేస్తారా ఏంటి అని ఆలోచించసాగాడు. కామ్రేడ్ సాబ్‌కు సన్నగా భయం ప్రారంభం అయ్యింది. అయినా ధైర్యం కూడ తీసుకుని ఈ పాట అయిపోగానే ఈ మంచం స్టేజి ఎక్కి తన వాగ్ధాటితో ఈ జనాన్ని అంతా ఆశ్చర్యపరిచి ఆఖరికి ఓట్ల విషయం చెప్పేస్తే సరిపోతది అని అనుకున్నాడు. ఇక ఎర్రచొక్కా యువకులకు ఏమి అర్థం కావడం లేదు. ఈ ఏరియా అంతా మనదే అంటూ పూల మాలలతో స్వాగతమిస్తారు అనే విధంగా చెప్పాడు కామ్రేడ్ సాబ్ ఇక్కడ చూస్తే స్వాగతాలు ఏమోకాని సావు చేసే విధంగా కనిపిస్తున్నది అని మనసులోనే అనుకుంటూ భారమంతా భగవంతుని మీద వేసి కూర్చున్నారు భయం భయంగా.

ఇంతలో పాట అయిపోయింది ఒక్క క్షణం నిశ్శబ్దం నెలకొన్నది. ఇదే అదను అనుకుని కామ్రేడ్ సాబ్ మంచం ఎక్కడానికి మంచంపై ఒక కాలువేసి మీదికి లేవబోయాడు కాని మంగ్లు వెంటనే సాబ్ కాలర్ పట్టుకుని కిందికి లాగి

563

"జామ్ కొట్టోమస్ ఓరు తిరియితోర్" (కొద్దిసేపు మొదలకుండా ఉండు అతను మాట్లాడుతాడు) అన్నాడు కోపంగా. తను ఆలోచించినట్లుగానే జరిగేటట్టు ఉంది అనుకునేసరికి భయం కొస్త వణకుగా మారింది. అసలే మంగ్లు భుజానికి ఒక బర్మార్ కూడా ఉంది అతను గ్రామ రక్షణదళ కమాండర్.

మూఖాల్ గొంతు సవరించుకుని "కామ్రేడ్స్ నేడు బాత మీటింగ్ ఇత్కె" (ఇవ్వాళ ఏమి మీటింగ్ అంటె) అంటు మొదలుపెట్టి ప్రభుత్వ ఎన్నికల ప్రకటన గురించి చెప్పి ఎన్నికల బూటకత్వం వివరిస్తూ ఎన్నికలను బహిష్కరించాలని రైతులను కోరాడు. దోపిడి వర్గ పార్టీల బూటకపు వాగ్దానాలను ఎండగడ్తూ వాళ్ల ఆచరణను ఉదాహరణలతో అర్థం చేయించాడు ప్రజలకు ఎన్నో ఏండ్లనుండి ఓట్లు వేస్తున్నా, అన్ని సంపదలు ఉన్న బస్తర్ ఎందుకు వెనకబడి ఉందో చెప్తూ పరిష్కారానికి పోరాటం ఒక్కటే మార్గం అంటూ వివరించాడు. ఈ ఉపన్యాసం అంతా వింటున్న కామ్రేడ్ సాబ్‌కు మతిపోయినంత పని అయ్యింది. బస్తర్‌లో ఈ మారుమూల గ్రామంలో ఒక ఆదివాసి యువకుడు ఈ విధంగా ఉపన్యసించడం నమ్మలేకపోతున్నాడు. ఇక ఇక్కడ ఓట్లు అడగడం అంటే తన్నించుకోవడమే అవుతుంది. కిమ్మనకుండా పోవడమే మేలు అని కామ్రేడ్ సాబ్ అనుకుంటుండగానే "అయితే ఇప్పుడు వీళ్ళు మనల్ని ఓట్లు అడగడానికి వచ్చారు. కాబట్టి ఇన్ని సంవత్సరాల నుండి ఎన్నికలలో పాల్గొంటు మనకోసం ఏమేమి చేశారో వీళ్ళను అడుగుదాం. సరిగ్గా చెప్పితే మీటింగ్ చేసుకోనిద్దాం లేకపోతే ఇక్కడి నుండి తోకపీకాల్సిందే మీరంతా ఏమంటారు" అంటూ మూఖాల్ జనాన్ని అడగడం కామ్రేడ్ సాబ్‌కు వినపడ్డది పిడుగుపడ్డట్టుగా. ఇంకా జనం అంతా అంతే అనడంతో సాబ్‌కు గుండె గాభరా ఎక్కువైంది.

మీటింగ్ పెట్టుకోనియ్యకపోతె పోనియ్ జీపెక్కి ఈల పాట పాడుకుంటు హాయిగా పోతాం కాని ఏమేమి చేశామో చెప్పాలంటున్నాడు వీడు. ఎక్కడ తలనొప్పిరా నాయనా ఎరక్కపోయి వచ్చి ఇరుక్కునట్లు అయింది. అన్నలం మేము ఒకటే అన్నా వినే రకంగాలేరు వీళ్ళు. ఇప్పుడు ఏం చేయాలి అనుకుంటు ఆలోచనలలో సతమతమవుతుండగానే కామ్రేడ్ సాబ్‌ను "ఏయ్ కామ్రేడ్ నిన్నే ఇప్పుడు మీరు రైతుల బతుకుల కొరకు ఏమేమి చేశారో చెప్పండి" అన్నాడు కామ్రేడ్ అనే పదాన్ని వ్యంగ్యంగా పలుకుతు మూఖాల్. ఏం చెప్పాలో తేల్చుకోక ముందే ప్రశ్న

564

వచ్చి మీద పడడంతో అసందర్భంగా ఏదో ఒకటి చెప్పక తప్పక "ఆఁ ఆఁ ఏంటి మేం ఏం చెయ్యలే దనుకుంటున్నారో మేం చెయ్యబట్టే జంగలోళ్ళు, (ఫారెస్టు డిపార్టుమెంటు) మీరు అడవి నుండి ఎన్ని కట్టెలు తెచ్చుకున్నా, కొత్త కొత్త ఇండ్లు కట్టుకున్నా రూపాయలు వసూలు చేయడం లేదు. మేం చెయ్యబట్టే పట్వార్లు మిమ్మల్ని తిప్పలు చేయడం లేదు. మేం— చెయ్యబట్టేఅంటూ ఇంకా ఏదో కొనసాగించ పోబోయాడు కాని ఇంతలో ఒక రైతు లేచి అడ్డు తగులుతు "ఎహె ఎవఁడా నువ్వు ఎన్నడూ నీ మొఖం కూడా కనిపియ్యలేదు. యాడకూచోని నువ్వు ఇవన్ని చేసి నవ్‌రా" అంటూ కోపంగా అడిగాడు. జనాలంతా కూడా తలా ఓ మాట తిట్టడం మొదలుపెట్టారు. సాబ్‌కు చెమటలు కారడం మొదలుపెట్టింది. అటూ ఇటూ బిత్తర చూపులు చూస్తూ ఉండగా దూరంగా ఒక బోరింగ్ కనిపించింది. వరదలో కొట్టుక పోయే చీమకు దుంగ దొరికినట్లు అయ్యింది సాబ్‌కు. వెంటనే "ఆఁ మీ ఊర్లో బోరింగ్ ఎవరు వేయించిండ్లు అనుకుంటున్నారు మేమే కలెక్టర్‌తో ఎంత గొడవ పడితే కాని ఈ ఊర్లన్నిటికి బోరింగ్‌లు రాలేదు తెలుసా" అన్నాడు తన తెలివికి తనే మురిసిపోతూ, కలెక్టర్‌తో గొడవపడ్డది లేనిది అయితే జనానికి తెల్వదు అనేది సాబ్‌ధీమా కాని సాబ్ మాటలు విన్న జనం నగలబడి నవ్వడం మొదలు పెట్టారు.

నవ్వులను ఆపుతూ మూఫాల్ అందుకున్నాడు "ఏయ్ బోరింగ్ ఎవరు వేయిం చింది. ఎందుకు వేయించింది కూడా మాకు తెల్సు. అయినా కొద్దిసేపు నువ్వే వేయిం చావు అనుకుందాం అయితే ఏంది నీ బోరింగ్‌తో మా కడుపు నిండిందా ? లేకపోతే బోరింగ్ ఉంటె అన్నం తిననక్కర లేదా ? ఈ ఊర్లో ఇంతకుముందు బోరింగ్ లేకున్నా బతికాము చావలేదు. కాని భూమి లేకుండా మేము బతకలేము. ఆ భూమి కోనం ఇక్కడ మేము ఇండ్లు వేసుకున్నప్పుడు, మేం అడవి నరికి పోడు చేసు కున్నప్పుడు నువ్వు ఎక్కడ ఉన్నావు ? ఫారెస్టు వాళ్ళు వచ్చి మా ఇండ్లు కాలబెట్టి మేం నరికిన భూమిలో ప్లాంటేషన్ వేసినప్పుడు ఎక్కడఉన్నావు ? మేం సంఘంలో సంఘటిత పడి ఫారెస్టు వాళ్ళ జులుంను తిప్పికొట్టినప్పుడు ఎక్కడ ఉన్నావు ? నువ్వు ఎప్పుడు ఎక్కడా కూడా మా అసలు సమస్యను పరిష్కరించడంలో లేవు. నీ సమాధానం మాకు ఒప్పదు. ఇక మా ఊరు బోరింగ్ విషయానికి వస్తే [illegible] పని చేయడం బంద్ అయ్యి ఎనిమిది నెలలు అవుతున్నది. ఇప్పుడు వాగులో తీసిన

చెలిమలోని నీరే తాగుతున్నాము మేము. బోరింగ్ పేరు మళ్ళీ చెప్పితే తన్నులు తింటావు" అన్నాడు తన దీర్ఘమైన సమాధానాన్ని ముగిస్తూ-

కామ్రేడ్ సాబ్‌కు అప్పుడు అర్థం అయ్యింది తను బోరింగ్ మేమే వేయించాం అనేసరికి జనాలంత ఎందుకు నవ్వారో. అంతేకాదు ఇక చేతులెత్తి ఓటమిని అంగీకరించి తిరోగమించడమే ఉత్తమమని కూడా అర్థం అయ్యింది. అంతే వెంటనే "కామ్రేడ్స్ మేం తెలవక వచ్చాము. మిమ్ములను ఓట్లు అడిగేందుకు మాకు ఎలాంటి అర్హత లేదు. మేము మీ ఊరిలో మీటింగ్ చెయ్యం ఇక వెళ్ళిపోతున్నాము" అంటు ప్రకటించాడు నీళ్ళు నములుతూ బిత్తరచూపులు చూస్తూ-

× × ×

ఒక్కొక్క ఊరు దాటుతున్న కొద్ది ఒక్కొక్క డిగ్రీకోపం పెరుగుతున్నది మన్సూరాం సోడిలో. జీపులో ముందు సీట్లోనే కూర్చున్నాడు కాని ముందుకు చూడడం లేదు. ఏదైనా ఊరు రాగానే కుడి ఎడమలకు వంగి వంగి చూస్తున్నాడు జీపులో నుండే. ఎక్కడా ఒక్క నినాదం కనిపించడం లేదు. ఒక్క పోస్టర్ ఒక్క జెండా కూడా కనిపించడం లేదు. మనసులోనే పండ్లు నూరడం మొదలుపెట్టాడు సోడి "దొంగ వెధవలు వేలకువేల రూపాయలు దొబ్బారు. ఒక్క పోస్టర్ కూడా వేయించ లేదు. అప్పారావుగాడు ఎంత మోసం చేశాడు. ఇవ్వాళ వీడి సంగతేంటో తేల్చుకోవాలి" అని అనుకుంటుండగానే "సార్ గొల్లపల్లి వచ్చింది ఎన్నికల ఆఫీసు కాడికి పోనియ్యమంటారా జీపును" అంటు ప్రశ్నించాడు డ్రైవర్ "ఆఫీసు కాడికా ? వద్దు అప్పారావు ఇల్లు తెలుసు కదా అక్కడికే పోనియ్" అంటు డ్రైవర్‌ను ఆదేశించాడు. అప్పారావును ఏమేమి ప్రశ్నలు అడగాలో మనసులోనే తయారవుతుసోడి.

అప్పారావు అప్పుడే టిఫిన్ ముగించి టీ తాగివచ్చి ముందుగదిలో కూర్చున్నాడు. బుర్రుమంటు సోడి జీపువచ్చి అప్పారావు ఇంటిముందు ఆగింది. అప్పారావు కూడా రెండు రోజులనుండి సోడి గురించే ఎదురుచూస్తున్నాడు. ఎదురు చూడడమే కాదు రెండు రోజులనుండి సోడివచ్చి అడిగే ప్రశ్నలను ఊహించుకుంటూ వాటికి సమాధానాలను తయారు చేసుకుంటున్నాడు. జీపును చూడగానే లేని ఆదరాబాదరాను తెచ్చిపెట్టుకుని జీపు దగ్గరికి వెళ్ళి "రండి రండి చాలా ఆలస్యం అయ్యింది మీకోసమే ఎదురు చూస్తున్నాను" అంటూ ఇంట్లోకి ఆహ్వానించాడు అప్పారావు. ఎందుకు మరో రెండు మూడు వేలకు గాలం వేద్దామనా ? అని మనసులోనే కసిగా అనుకున్నాడు.

మీదికి మాత్రం "అ ఏంలేదు. చాలావని ఉండడంవల్ల ఆలస్యం అయ్యింది" అంటూ జీపు దిగి అప్పారావును అనుసరించాడు సోడి. ఎంత కనబడనీయ వద్దనుకున్నా చిర్రు బుర్రు బయట పడుతూనే ఉంది సోడిలో -

ఇద్దరు ఎదురెదురుగా కుర్చీలలో కూలబడ్డారు. ఆలస్యం చేయకుండా అప్పారావు లేని ఆప్యాయతను అంత ఒలకబోస్తూ "టిఫిన్ చేశారా లేదా సార్ ఏం తీసుకుంటారు"....అంటూ ఇంకా ఏం తాగుతావు అని కాబోలు అడగబోయాడు. కాని కళ్ళనిండ ఎన్నికలే నిండి ఉన్న సోడి ఎన్నికల ప్రచారం గురించే తేల్చుకోవాలనుకున్నాడు అందుకే అప్పారావు మాటలను మధ్యలోనే తుంచేస్తూ "ఇప్పుడు నాకు టిఫిన్‌లు టీలు తాగే తీరిక లేదుకాని నీ ఏరియాలో ఎక్కడ ఎన్నికల ప్రచారం కనిపించడం లేదేం ? ఎక్కడ ఒక్క పోస్టర్, జెండా కూడా కనిపించడం లేదు. అసలు నేను ఎన్నికల్లో గెలవాలనుకుంటున్నావా ఓడిపోవాలనుకుంటున్నావా" అంటు గుక్కతిప్పుకోకుండా కోపాన్నంత వెళ్ళగక్కాడు సోడి- తీసుకున్న డబ్బుల గురించి కూడా అడుగుదామనుకున్నాడు. కాని ఈ ఏరియాలో సోడికి ఉన్న ఒకే ఒక ఆధారం అప్పారావు. అందువల్ల డబ్బు విషయంలో గట్టిగా పట్టుబడితే అప్పారావు వ్యతిరేకంగా మారినా మారవచ్చు అప్పుడు మొదటికే మోసం వస్తుందని డబ్బు మాట ఎత్తలేదు- చిర్రుబుర్రులాడో చివాట్లుపెట్టో పని నడిపించుకోవాలికాని పని కుంటుపడేలా చేసుకోవద్దు అనేది సోడి విధానం.

కాని అప్పారావుకు ముందు నుయ్యి వెనక గొయ్యిలా ఉంది. ఇక సోడి ఏమనుకున్నా ఫర్వాలేదనుకుని అసలు విషయంలోకి దిగాడు. అప్పారావు గొంతు సవరించుకుంటు "చూడండి సార్ మీరు ఎంత చిర్రు బుర్రులాడినా కొరాలు మిరియాలు నూరినా నేను ఏమి చేయలేను. ఇది నక్సలైట్ల ఏరియా అని మరిచిపోతున్నారు. జనం తెలివి అయిపోయినారు. వెనకటిలాకాదు, ఇప్పుడు ఓట్లు అడగపోతే ఎందుకు వేయాలి, మీరు మాకేం చేశారు అంటు నిలదీస్తున్నారు జనం. ఇక సంఘాల నాయకులైతే ఉద్యోగాలకోసం పోయిన వాళ్ళను ఇంటర్‌వ్యూ చేసినట్లు చేసి జనంలో సిగ్గు తీస్తున్నారు. మీరే చెప్పండి జనాలకు ఏం చెప్పి ఓట్లు అడగమంటారు" అంటూ తన బాధనంత సోడిముందు పరిచాడు.

సోడి ముందు తత్తరపడి ఆపైన గుర్తుకు వచ్చి యురెకా అనుకుంటు "అ( జనానికి మనం ఏమి ఎందుకు చేయలేదు. ఊరూరుకు బోరింగ్ ఎవరు వే[illegible]రు.

567

మనం బోరింగ్‌లు వేయించకపోతే జనం నీళ్లు లేక చచ్చేవాళ్లు తెలుసా? జనం అడిగి నప్పుడు ఈ విషయం ఎందుకు చెప్పలేవు" అంటు ఎదురు ప్రశ్న వేశాడు. తను కనుగొన్న ఈ కొత్త విషయానికి నోబుల్ ప్రైజ్ వస్తదన్నంత సంతోషపడిపోతూ. కాని అప్పారావు మాత్రం విచిత్రంగా నవ్వాడు. ఆ నవ్వు ఓరి దద్దమ్మా ఆ చచ్చు విషయం నాకు తెలవదనుకుంటున్నవా అన్నట్లుంది.

ఒకసారి దీర్ఘంగా శ్వాస తీసుకుని మొదలుపెట్టాడు అప్పారావు "అయ్యో! సారు బోరింగ్ విషయం చెప్పితే జనాలు మన తలలో బోరింగ్ వేస్తారు. బోరింగ్‌ల సిద్ధాంతం జనానికి బోర్ కొట్టింది. ఇప్పుడు జనాలు బోరింగ్‌లు, స్కూళ్ళు, అంగన్ వాడీలు, బ్యాంక్ రుణాలు కాదు ముఖ్యంగా అడిగేది. వాళ్లు భూములు అడుగు తున్నారు అడవి నరికి చేసుకున్న భూములకు పట్టాలు అడుగుతున్నారు. భూమి లేకుండా మిగతావన్ని మాకు దండుగే అంటున్నారు. గతంలో గిరిజనులందరు అడవి కొట్టి చేసుకున్న భూములకు పట్టాలు కావాలని దరఖాస్తులు ఇస్తే పోలీస్ సేషన్‌కు పంపిస్తామని మన ప్రభుత్వం, ఫారెస్టు డిపార్ట్‌మెంట్ వాళ్ళు బెదిరించారు. అదే నక్సలైట్లు వచ్చి సంఘాలంటు పెట్టి గిరిజనులను ఏకం చేసి భూమి లేని వారిని అడవి కొట్టుకుని భూమి చేసుకోండని పోరాటం మొదలుపెట్టారు. భూమి సమస్యకు పరిష్కారం చూపించారు. సంఘాల బలం ముందు రేంజర్లు, పట్వార్లు పిక్కబలం చూపించారు. అందుకే గిరిజనులు అన్నల మాటే వింటున్నారు. బోరింగ్ అంటు మొదలుపెడితే బుర్ర బద్దలు కొడతారు జనం" అంటూ ఆగకుండా ఒక చిన్న ఉపన్యాసం దంచేశాడు సోడిని అదరగొడుతు. అప్పుడు కాని అర్థం కాలేదు సోడికి, ఫూల్ చాప్ (బి. జె. పి.) కశ్యప్ ఉత్తర బస్తర్‌లో అడవికొట్టి భూములు చేసుకోండి మేము అధికారానికి వస్తే పట్టాలు ఇస్తామంటు ఎందుకు ప్రచారం చేస్తున్నది.

సోడి అయోమయంలో పడిపోయాడు "అయితే ఈ ఏరియాలో ఓట్లమీద ఆశ వదులుకోవల్సిందే అంటావా? మరి సిపిఐ వాళ్ళు ఎలా చేస్తున్నారు" అంటు అనుమానంగా అడిగాడు. 'సిపిఐ వాళ్ళా? మొన్న ఈ ఏరియాలో ఓ గ్రామంలో గ్రామ రక్షణ దళానికి దొరికి చావు తప్పి కన్ను లొట్టపోయి పారిపోయినారు. ఇప్పుడు వాళ్ళు సుక్మ ఏరియాలో నక్సలైట్లు తిరగని గ్రామాలలో నక్సలైట్లు మేము ఒకటే అన్నలు మాకే ఓటు వేయమన్నారు అంటు ఓట్లు దండుకునే ఉపాయం చేస్తున్నారు. అంతగా తెలియని జనాలు నమ్ముతున్నారు కూడా. అందువల్ల సుక్మ ఏరియాలో 568

సిపిఐ వాళ్ళు లాభపడవచ్చు కాని ఈ కుంట ఏరియాలో మాత్రం జనం, ఎవరికి ఓట్లు వేయరు" అంటూ సిపిఐ వాళ్ళ కథ అంత ఏకరువు పెట్టాడు అప్పారావు. ఆశ చావని సోడి "మరి ఎలా చెయ్యడం" అంటూ మళ్ళీ అడిగాడు. సోడి పరిస్థితిని అర్థం చేసుకున్న అప్పారావు "వచ్చే బుధవారం గొల్లపల్లి సంతకు చుట్టుపక్కల ఊర్ల నుండి గిరిజనులు వస్తారు. సంతలో బహిరంగంగా మీటింగ్ చేయలేను కాని విడి విడిగా పెద్దమనుషులను కలిసి మనకే ఓటు వేయించమని చెప్పి చూస్తాను". అంటూ ఓదార్పుగా చెప్పాడు. మనవడు జీవగంజి పోసిన తరువాత బొమ్మ ప్రాణం తృప్తిగా పోయినట్లుగ సరే అలాగే కానివ్వు" అంటూ కుర్చీలో నుండి లేచాడు సోడి.

× × ×

1989 నవంబర్. స్కూలు బిల్డింగ్‌లో ఎస్.ఐ. అటు ఇటు తిరుగుతున్నాడు. చేతులు గట్టిగా గుద్దుకుంటు. ఎన్నికల అధికారి, సిబ్బంది బ్యాలట్ పెట్టెల ముందు కూర్చుని దోమలను తిట్టుకుంటు కొట్టుకుంటున్నారు. హవల్దార్ ఇద్దరు సిపాయిలు బీడీలు ముట్టించి దోమలపైకి పొగను ఊదుతున్నారు. ఊరేగింపుల మీద టియర్ గ్యాస్ వదిలినట్లు. పన్నెండు కావడానికి దగ్గర పడుతున్నది కాని ఇంతవరకు ఓటు వేయడానికి ఒక్కరు కూడా రాలేదు. జనాలు అందరు ఊరిలోనే ఉన్నారు. స్కూలు ముందు నుండె అటు ఇటు తిరుగుతున్నారు. కాని స్కూలు దిక్కు చూడనైనా చూడడం లేదు. అసలు ఇవ్వాళ ఎన్నికలు అనే విషయం ఎరగనట్లే ప్రవర్తిస్తున్నారు.

టైము పెరుగుతున్న కొలది, జనం ప్రవర్తన చూస్తున్న కొలది ఎస్.ఐ. కి కోపం విపరీతంగా పెరిగిపోతున్నది. గతంలో ఊరిలోకి పోలీసులు వస్తే ఎంత ఆర్భాటం జరిగేది. మంచాలు, కోళ్ళు, కల్లు సీసాలు పరుగెత్తుకుంటు వచ్చేవి. ఇప్పుడు ఒక్కడు నమస్తే సార్ అనికూడా అనడం లేదు. తలుచుకున్న కొలది ఒళ్ళు మండిపోతున్నది ఎస్.ఐ. కి. "దొంగ లంజకొడుకులు తినేది మొగడి సొమ్ము పాడేది రంకుమొగని పాట. సర్కారేమో బోరింగులు అవి వేయిస్తది. వీళ్ళేమో నక్సలైట్ల మాట వింటరు" అంటూ పోలీసుల భాష మొదలుపెట్టాడు ఎస్.ఐ.

"అసలు ఊరి బయట ఆ ఎన్నికలను బహిష్కరించండి అనే పోస్టరును చూచినప్పుడే అనిపించింది నాకు ఈ ఊరిలో ఓట్లు పడేటట్లు లేవని" అన్నాడు


569

ఎన్నికల అధికారి తనకు అన్ని విషయాలు ముందే తెలుస్తవి అన్నట్లు ఫోజు పెడుతు హవల్దార్ ఇద్దరు సిపాయిలు మాత్రం తక్కువ ఫోర్సు వచ్చాము కనుక ఏ గొడవ లేకుండ ఇక్కడి నుండి సురక్షితంగ పోతే చాలునని ఆలోచిస్తున్నారు. కాని ఎస్.ఐ. వాలకం చూస్తె హవల్దార్‌కు భయం అవుతున్నది. వీడు జనంతో గొడవ పెట్టుకుని అందరికీ తన్నులు తినిపించడు కదా అని హవల్దార్ అనుకుంటుండగానే "ఏయ్ హవల్దార్ నువ్వు ఈ ఇద్దరు పోలీసులను తీసుకెళ్ళి ఊరి వాళ్ళందరిని తీసుకురండి సంగతేందో తేల్చుకుందాం" అన్నాడు కోపంగా హుకుం జారీచేస్తూ ఎస్.ఐ. హవల్దార్‌కు ఎస్.ఐ. మాటలు వింటె ఏం జరుగుతుందో అర్థం అయిపోయింది. జరగబోయే ప్రమాదాన్ని నివారించడం కోసం ధైర్యం తెచ్చుకుని "సార్ ఊరిలో పరిస్థితి మంచిగ లేదు. ఒత్తిడి చేస్తే ఓట్లు వేసేలా లేరు జనం. అందరు ఒక్కమాట మీద ఉన్నారు. నేను అప్పుడు కటూల్ (మంచం) కోసం కామ్రేడ్ అనాల్సి వచ్చింది. ఇంతకు ముందే మన సిపాయి వెళ్ళి లాల్‌సలాం దాద అంటె కాని ఖిందెడు నీళ్ళు దొరకలేదు. మనం ఒత్తిడిచేస్తే జనం తిరగబడవచ్చు. జనం వెనకటిలా లేరు. మనం నలుగురమే ఉన్నాము మరోసారి ఎక్కువ ఫోర్సు తీసుకువచ్చి వీళ్ళ సంగతి తేల్చుకోవచ్చు. ఇప్పుడు కామ్‌గా వెళ్ళిపోతేనే మంచిది సార్" అంటూ హవల్దార్ పరిస్థితిని తన అంచనాను, అనుభవాన్ని అంత రంగరించి ఎస్.ఐ.కి అర్థం చేయించడానికి ప్రయత్నించాడు.

హవల్దార్ సర్వీస్‌కంటె తక్కువ సర్వీస్ ఉన్న ఎస్.ఐ.కి హవల్దార్ మాటల్లో నిజం ఉన్నట్లు అనిపించలేదు. హవల్దార్ కావాలని తనను భయపెట్టాలని చూడడం లేదుకదా అని అనుకుంటుండగానే "అవునండి హవల్దార్ చెప్పినదాంట్లో నిజం ఉన్నది. అయినా ఇంటింటికి వెళ్ళి తీసుకువచ్చి ఓట్లు వేయించడం మన డ్యూటీ కాదు కదా. ఎవరైనా ఓటు వేయడానికి వస్తే వేయించే బాధ్యత మాది. ఈ బ్యాలట్ పెట్టెల రక్షణ బాధ్యత మీది" అంటూ ఎన్నికల అధికారి కూడా అనేసరికి ఎస్.ఐ. అనుమానంలో పడ్డాడు.

ఏమి చేయాలో తోచడం లేదు కాని అవమానం మాత్రం దహించివేస్తున్నది. జనం సంగతి తర్వాత చూసుకున్నా వెంటనే మాత్రం ఏదో ఒకటి చేయాలను కున్నాడు ఎస్.ఐ. చేతులు ఇంకా గట్టిగా గుద్దుకుంటూ ఇంకా వేగంగా అటూఇటూ తిరగడం మొదలుపెట్టాడు. అప్పటికి సాయంత్రం నాలుగున్నర కావస్తున్నది.

570

ఇంతలో కిటికీలో నుండి స్కూలు ముందర కొద్దిదూరంలో బోరింగ్ కనిపించింది ఎస్.ఐ.కి వెంటనే మంత్రం వేసినవాడిలా నిలబడిపోయినాడు. కొద్దిసేపు తీవ్రంగా ఆలోచించి "దేఖియే (చూడండి) ఇంకా ఓట్లు వేయడానికి ఎవడు రాడు కాని మీరు ఆ పెట్టెలు తీసుకుని వెళ్ళి జీపులో కూర్చోండి" అని ఎన్నికల అధికారులకు చెప్పి పోలీసుల వైపు తిరిగి "ఒరేయ్ మీరు ఆ బోరింగ్ వద్దకు నడవండి మన ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎన్నికలలో వీళ్ళ పాల్గొనకపోతే మన ప్రభుత్వం వేయించిన బోరింగ్ నీళ్ళు కూడా వీళ్ళు తాగవద్దు దాన్ని విరగ్గొట్టాలి నడవండి" అంటూ ఆదేశించి ఎస్.ఐ. తనే ముందు కదిలాడు మిగతా పోలీసులు వస్తున్నారా లేదా అనేది కూడా చూడకుండానే. హవల్దార్ మిగతా ఇద్దరు పోలీసులు ఇక తప్పదురా నాయనా అనుకుంటు బయలుదేరారు. ఎలాగు టైం కూడా ముగియ వస్తున్నందున బ్యాలట్ పెట్టెలు తీసుకుని వెళ్ళి జీపులో కూర్చున్నాడు ఎన్నికల అధికారి మిగతా ఎన్నికల సిబ్బందితో కలిసి.

ఎస్ ఐ. వెనుక వెనుక పోలీసులు కూడా బోరింగ్ వద్దకు చేరుకున్నారు దేనితో విరగ్గొట్టాలి అని అటుఇటు చూచేసరికి ఎస్.ఐ.కి దగ్గర్లోనే వెనకట ఎప్పుడో మోరి కట్టడానికి తెచ్చి కట్టకుండ అలాగే ఉండిపోయిన పెద్ద పెద్ద రాళ్ళకుప్ప కనిపించింది. అంతే ఆలస్యం చేయకుండా రాళ్ళకుప్ప దిక్కు ఒకసారి బోరింగ్ వైపు ఒకసారి చెయ్యితో చూపుతూ "ఒరేయ్ ఆ రాళ్ళు తెచ్చి దీనిమీద ఎత్తెయ్యండిరా" అంటూ ఆదేశించాడు. ఎప్పుడో శారీరక శ్రమకు దూరమైన పోలీసులకు ఆ రాళ్ళు లేపడం చాలా కష్టమనిపించింది. అందుకే ఊరివాళ్ళను, ప్రభుత్వాన్ని, ఎస్ ఐ ని మనసులోనే తిట్టుకుంటు ఊఁఊఁ అంటు మూల్గుకుంటు ఒక్కొక్క బండ ఎత్తుక వచ్చి బోరింగ్ మీద దడామ్ ధడామ్ ఎత్తేస్తున్నారు. ఎస్ ఐ కి ఆలస్యం అవుతున్నట్లు అనిపించింది. తను కూడా చేతులపై అంగీని పైకి జరుపుకుంటు వెళ్ళి మోస పోస్తూ రాళ్ళను ఎత్తుకవచ్చి కసిగా ఎత్తేస్తున్నాడు లాకప్‌లో పెట్టి ఊరి వాళ్ళందరని కొడుతున్నట్లు ఫీలౌతూ. ఎన్నికల అధికారి మిగతా సిబ్బంది భయంభయంగా చూస్తున్నారు జీపులో నుండి జవాలు ఏమన్నా చెయ్యరు కదా అనుకుంటు.

ఊరి జనం అందరు ఒకరొక్కరే దూరంగా గుమిగూడారు ఈ చోద్యాన్ని విచిత్రంగా చూస్తూ. గుంపులో చిన్నగా గుసగుసలు మొదలయ్యాయి. 571 గుసగుసలు నవ్వులుగామారాయి. పిచ్చివాళ్ళను చూసి నవ్వుతున్నట్లుగా నవ్వుతూ అందరు ఎటు→

అనువాద కథ

# ఒక తల్లి కొడుకు

**అజీత్ కౌర్**

కన్ను పొడుచుకొన్నా కానరానంత కటిక చీకటిగా వుంది బయట. చీకటి తెరలు చీల్చుకొంటూ కుక్కల అరుపులు వినొస్తున్నాయి.

ఎంత ప్రయత్నించినా కునుకు పట్టటంలా. మా అన్నయ్య కేవల్‌ని ఎవరో హత్యచేశారు. అప్పటి నుంచి అమ్మకీ, నాకూ నిద్రే కరువైంది. అమ్మ మూర్తీభవించిన శోకదేవతలా నోటమాటలేక మూగవోయినట్లుంది. ఒకరికొకరం నిద్రపోతున్నట్లు నటిస్తున్నాం — అలాగైనా ఎవరో ఒకరం నిద్రలోకి జారుకోవచ్చుని —

అన్నని ఉగ్రవాదులు చంపారనుకొంటున్నారు. మాకైతే ఏమీ తెలియదు. తెలిసినంతలో కేవల్ ఎవరినీ నొప్పించే మనిషైతే కాదు. ఎవరైనా మరి ఎందుకు చంపుతారో ?

---

→వాళ్ళు అటు వెళ్ళిపోయారు. అటుఇటు చేసి చివరికి బోరింగ్ విరిగింది. ఎస్.ఐ.కి తృప్తి కలిగింది. చేతులు దులుపుకుంటు "ఇక పదండిరా" అంటు జీపులో వెళ్ళి కూర్చున్నాడు. మిగతా పోలీసులు కూడా వెళ్ళి కూర్చున్నారు.

జేబులో నుండి దస్తీ తీసి కారుతున్న చెమటను తుడుచుకుంటు "దొంగ లంజ కొడుకులు ఇప్పుడు ఎక్కడి నీళ్ళు తాగుతారో చూద్దాం" అన్నాడు గొప్ప విజయం సాధించిన వానిలా ఎస్.ఐ. వెంటనే హవల్దార్ అందుకుంటు "సార్ ఇప్పుడు వాళ్ళు బోరింగ్ నీళ్ళు తాగడంలేదు. అది చెడిపోయి ఎనిమిది నెలలు అయ్యిందట. రిపేరు కోసం దరఖాస్తు ఇచ్చి ఆరు నెలలు అయ్యిందట. ఊరివాళ్ళు చెలిమలోని నీళ్ళే తాగుతున్నారు. అందుకే అప్పుడు బిందె నీళ్ళ కోసం లాల్‌సలాం చెప్పాల్సి వచ్చింది" అన్నాడు. అంతే ఎస్.ఐ. నోరు తెరుచుకుని ఉండిపోయింది. ఊరివాళ్ళు అదోలా నవ్వుతూ దూరం నుండే వెళ్ళిపోవడం కండ్ల ముందు మెదిలింది. జీపు కదిలింది.

572